# తీపిజబ్బు చేదుశిక్ష

-కన్నెపల్లి చలమయ్య

## తడి మంటలు

-కన్నెపల్లి చలమయ్యశాస్త్రి

''మా కాలేజి ఎడ్యుకేషన్ టూర్‌కి డబ్బు చెల్లించాల్సింది రేపేనమ్మా! ఇంతవరకూ నువ్వు అక్కని డబ్బు అడగలేదు. నేను పేరు ఇచ్చేసాను. రేపు ఏ మొహంతో కాలేజికి వెళ్లేది?''

చిన్నపిల్లాడిలా మారాం చేస్తున్న కొడుక్కి ఎలా చెప్పాలో అర్థం కాలేదు విశాలకి. వాడి గోల చిరాకు కలిగిస్తోంది.

''ఎవర్నడిగి పేరిచ్చావ్‌రా? ఇంట్లో డబ్బు మూలుగుతోందనుకున్నావా?'' నిరసనగా చూసి విసురుగా జవాబిచ్చాడు హరీష్. ''ఇంత చిన్నపాటి కోరికలు తీర్చలేనప్పుడు నన్ను కాలేజీలో చేర్చారెందుకు? ఏ సినిమాహాల్లోనో గేటుకీపరుగా నాపొట్ట పోషించుకోలేక పోయేవాడినా?''

విశాల మనస్సు చివుక్కుమంది. ఏదో జవాబు చెప్పబోయింది. అది వినిపించుకోకే హరీష్ వెళ్లిపోయాడు.

వీడినేనా కాన్వెంట్ డ్రెస్‌లో స్కూలుకెళ్లేటప్పుడల్లా మైమరిచి చూసేదితను!

''వీడ్ని ఢిల్లీ పంపించి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో చదివిస్తాను. ఐయేయస్ చేస్తాను'' అని మురిసిపోయేవాడు భర్త.

ఆ మాట వింటున్నప్పుడు ఏదో రంగులకల చూస్తున్నట్లుండేది.

అలాంటి కలల్లోనూ, భ్రమల్లోనే తన జీవితం గడిచిపోయింది.

ఆఫీసుకు బయల్దేరిన భర్త సిటీబస్సు ప్రమాదంలో అకస్మాత్తుగా మరణించాకగానీ తమ స్థితిగతులేమిటో తెల్సిరాలేదు.

పెన్షన్ లేని ఉద్యోగం భర్తది. కంపెనీ ఏదో కంపెన్సేషన్ ఇచ్చి చేతులు దులుపుకుంది. క్వార్టర్ విడిచిపెట్టాల్సి వచ్చింది. బ్రతుకు రోడ్డు మీద పడడం అన్న సత్యం అనుభవంలో తెల్సింది.

రేపటి గురించి ఆలోచన లేకపోవడం, ఒక్కళ్ళే సంపాదనమీదనే కుటుంబం ఆధారపడడం- రెక్కలు విరిచిన పక్షుల్లా విలవిల లాడాల్సివచ్చింది.

అప్పటికే ఇంటర్ మీడియెట్ పూర్తిచేసి ఇంట్లో తెలుగు నవలల్ని చదువుతూ ఊహల్లో ఊరేగే కూతురు పద్మినిపై బరువు బాధ్యతలు పడ్డాయి.

తెల్సినవాళ్ళ కాళ్ళు పట్టుకున్నాక, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులో టైపిస్ట్ ఉద్యోగం దొరికింది. వెల్లువలో చిక్కుకున్న ప్రాణికి దొరికిన గడ్డి పోచలాటి ఆధారం.

పద్మిని తర్వాత హరీష్- బి.కాం రెండో సంవత్సరం చదువుతున్నాడు.

తర్వాత పావని- తొమ్మిదో తరగతి.

భర్త బ్రతికే వుంటే, పద్మినికి పెళ్లయి అత్తారింటికి తరలిపోయేదే!

దాని ఈడు అమ్మాయిలంతా పెళ్లిళ్లయి ముచ్చటగా కాపురం చేస్తున్నారు. వాళ్ళని చూస్తుంటే మనస్సు కెలికిన పుండులా సలుపుతుంటుంది.

''మమ్మీ- నా స్కూలు డ్రెస్ ఇరుకయింది. కొత్తడ్రెస్ కుట్టించమని ఎన్ని రోజులైంది చెప్తున్నాను?'' పావని మాటలతో ఉలిక్కిపడింది విశాల.

చాలీచాలని బట్టల్లో, శరీరం పొదుగుతున్న ఆడతనాన్ని దాచుకునే విఫల ప్రయత్నంలో విసిగిపోయిందా అమ్మాయి.

''కుట్టిద్దామమ్మా- అక్కకి ఈనెల జీతాలందగానే...''

''అబద్ధం. నువ్వు కుట్టించవు. మూడు నెలలై ఇదేమాట చెప్తున్నావు. నువ్వడగలేకపోతే చెప్పు, నేనే అక్కని అడుగుతాను. ఈ ఇరుకు బట్టల్తో రోడ్డుమీద నడుస్తుంటే'' దుఃఖం, అవమానం గొంతు పట్టేస్తుంటే మాట పూర్తి చేయలేకపోతోంది పావని.

''సర్దుకోవాలమ్మా- అనుకోగానే- అన్నీ చేసెయ్యాలంటే మనలాటి వాళ్ళకు సాధ్యమా?'' అనునయించబోయింది విశాల.

వెళ్లబోతున్నదల్లా ఒక్కక్షణం ఆగి, తల్లికేసి నిరసనగా చూస్తూ అంది పావని. ''గుమ్మం దాటిన దగ్గర్నుండి- జాంతంతు పాపాయని పోకిరీ వెధవలు కూస్తున్నా సర్దుకుపోవాలా?'' అంకురిస్తున్న నవయవ్వనాన్ని, ఆగని ఆడతనాన్ని పుస్తకాల వెనుక దాచే ప్రయత్నంలో ముడుచుకుపోతూ రోడ్డెక్కింది పావని.

ఈ పిల్లలో పేదతనాన్ని లేక ఆడతనాన్ని చూసే పోకిరీ కళ్లని తలచుకుంటే భయం వేసింది విశాలకి. ఇవన్నీ వినడానికి, చూడడానికే బ్రతికివుందాతను?

తనూ, భర్తా, ముచ్చటగా ముగ్గురు పిల్లలు- స్వర్గసీమలాటి తన కుటుంబం, కించిత్ భోగం అనుభవించి ముక్కలైన బ్రతుకులోని యదార్థం ఆమెను కలవరపరుస్తున్నాయి.

నిన్న-గడిచిపోయిన రంగుల కల.

నేడు-గడవలేని చిక్కుల వల.

రేపు...అంతర్లీనంగా ఏదో ఊరట.

ఈ కష్టాలు మాత్రం శాశ్వతమా? రేపు హరీష్ కాలేజి చదువు పూర్తయి, ఎక్కడో ఉద్యోగం దొరికితే- పద్మినికి పెళ్లిచేసి అత్తారింటికి పంపెయ్యదూ?

ఇక శేషజీవితానికి ఒడిదుడుకులేవుంటాయి?

గడియారం పదకొండు గంటలు కొట్టడంతో ఉలిక్కిపడింది విశాల.

పద్మినికి క్యారేజి పంపే వేళయింది. సైకిలబ్బాయి ఈ క్షణంలోనో, మరో క్షణంలోనో వస్తాడు. ఆలోచనల్లోంచి విముక్తి పొందినదానిలా వంటింట్లోకి నడిచింది.

సరిగ్గా అయిదు నిముషాలయ్యేలోగానే కాలింగ్ బెల్లు గణగణ మ్రోగింది.

తలుపుతీసింది విశాల. సరోజ! పద్మిని హైస్కూలు క్లాస్‌మేట్. హాస్పిటల్ డ్యూటీ అయిపోయింది కాబోలు, ఇంకా నర్సు డ్రెస్సులోనే ఉంది.

''పద్మ ఆఫీసుకు వెళ్లిపోయిందా పిన్నిగారూ?'' అంటూ ఇంట్లోకి వచ్చింది.

నెలకోమారు అకారణంగా వచ్చేసే ఈ అమ్మాయంటే సదభిప్రాయం లేదు విశాలకి. ఎవరో కుర్ర డాక్టరుతో ప్రేమాయణం సాగిస్తోందని ఊరూవాడా అనుకోవడం తెలుసు.

అకారణంగానే ఆమెపై సదభిప్రాయం లేదు. తాచెడ్డకోతి వనమంతా చెరిచినట్టు ఈమె పద్మినిని చెడగొట్టదుకదా! అయినా, ఈ నర్సుతో పద్మినికేం స్నేహం? మతి, సుతీ లేకపోతే సరి-

చొరవగా పద్మిని గదిలోకి నడిచి, మంచం మీద కూచుంది.

''పిన్నిగారూ-కాసిన్ని మంచినీళ్లు ఇస్తారా?'' అడిగింది.

విశాల వంటింట్లోంచి గ్లాసుతో నీళ్లు తెచ్చింది. గడగడా నీళ్లు త్రాగేసి లేచింది.

''పద్మిని వస్తే నేనొచ్చివెళ్లినట్టు చెప్పండి'' అందిలేస్తూ. ఆమె వెళ్లిపోయాక, అలుముకున్న దుర్గంధం దూరమయిన భావన కల్గింది విశాలకు.

వంటింట్లోకి నడిచి క్యారేజి సర్దింది. సరిగ్గా అప్పుడే సైకిలబ్బాయి వచ్చాడు.

ఇంట్లోకి చూస్తూ అరచినట్టు చెప్పాడు. ''అమ్మాయిగారు ఆఫీసు డ్రాయరు తాళాలు ఇంట్లోనే మరచిపోయేరట. తీసుకురమ్మని చెప్పారు.''